క్లుప్తంగా

కాలువ పనులు పరిశీలన



కాలువ పనులను పరిశీలిస్తున్న నాయకులు

కంచిలి: బెల్లుపడ పంచాయతీ కేంద్రంలో సిమెంటు డ్రెయిన్ నిర్మాణాన్ని రూ.ఐదు లక్షలతో చేపడుతున్నారు. ఈ పనులను జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, స్థానిక సర్పంచ్ అయిధం జయరాం శుక్రవారం పరిశీలించారు.

అమ్మవారికి జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ విజయ తదితరులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఉలాల భారతిదివ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్ ఉన్నారు.

అగ్నిగుండం తొక్కిన భవానీ భక్తులు



అగ్నిగుండం పైనుంచి వెళ్తున్న భవానీ భక్తులు

టెక్కలి రూరల్: సన్యాసి నీలాపురం గ్రామంలో గురువారం రాత్రి భవానీ స్వాములు అగ్నిగుండం తొక్కారు. గురుభవానీ నాగాపు గోపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు మూడు వందల మంది భవానీ భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

శాంతియుతంగా కొత్తమ్మతల్లి ఉత్సవం:ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలు శాంతియుతంగా ముగిశాయని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాంకేతిక ఆధారిత భద్రతా చర్యలు వినియోగించడంలో అధికారులు, సిబ్బంది కృషి చేశారని చెప్పారు. ప్రజలు కూడా ఆందోళన లేకుండా విశ్వాసం, భక్తిభావంతో ఉత్సవాన్ని జరుపుకున్నారన్నారు.

స్త్రీనిధి రుణాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

సోంపేట: స్వయంశక్తి సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాలపై అవగాహన కల్పించాలని ఏపీఎం ప్రసాదరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో సీసీలు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించి స్త్రీనిధి రుణాలు, చెల్లింపు చేసే విధానం, దాని ప్రయోజనాలు వివరించారు. మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు రుణాలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

జాబ్‌మేళాలో 179 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో అధికారులు, కళాశాల సిబ్బంది

సోంపేట: నిరుద్యోగ యువత ప్రైవేటు కంపెనీలలో కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ అన్నారు. సోంపేటలోని కొంచాడ రాజేశ్వరరావు డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో జాబ్‌మేళాను శుక్రవారం నిర్వహించారు. 336 మంది హాజరవ్వగా.. 179 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ శేషాద్రి, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఉజ్వల్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం విక్రయాలకు అడ్డేలేదు!



బెల్టుషాపులకు తరలిస్తున్న మద్యం సీసాలను ఇటీవల పట్టుకున్న ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు (ఫైల్)

- యథేచ్ఛగా బెల్టు దుకాణాల నిర్వహణ
- బాటిల్‌పై అదనంగా రూ. 50 వసూలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు



కవిటిలోని మద్యం దుకాణం నుంచి బాటిళ్లను తరలిస్తున్న బెల్టు షాపు నిర్వాహకుడు



ఈదుపురం వైన్ షాపుల వెనుక మందుబాబులకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యం

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మద్యం విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. వీధివీధికి బెల్టు షాపులు, పల్లెపల్లెకూ మద్యం దుకాణాలు వెలిశాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం దొరుకుతోంది. దీంతో పట్టుమని పాతికేళ్లు కూడా లేని యువత సైతం పట్టపగలే పూటుగా తాగి హల్‌చల్ చేస్తున్నారు. కొందరు మద్యం దుకాణాల పక్కనే కునుకు తీస్తున్నారు. మరికొందరు మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

జనావాసాల్లో మద్యం దుకాణాలు

ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో జనావాసాల మధ్యే మద్యం దుకాణాలు వెలిశాయి. కొన్ని మద్యం దుకాణాల వద్ద పక్కన, వెనుక రూములు, బండలు వేసి మందు బాబులకు వసతి కల్పిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి పార్టీల నాయకులు ఒత్తిడి చేస్తుండటంతో అధికారులు కూడా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు.

బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు దర్జాగా బెల్టు దుకాణాలు నడిపిస్తున్నారు. డొంకూరు, కపాసుకుద్ది, కర్రివానిపాలెం, ఇద్దివానిపాలెం, కళింగపట్నం, ఇసుకలపాలెం, గొల్లగండి తదితర మత్స్యకార గ్రామాల్లో స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. బెల్టు షాపులు నిర్వహణకు ప్రతి నెల గ్రామాభివృద్ధి పేరుతో రూ. 60 వేల వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. అలాగే స్థానిక పోలీస్, ఎక్సైజ్ స్టేషన్లకు నెలవారీ మామూళ్లు చెల్లిస్తున్నారు. అంతే కాకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వ్యక్తులు స్వచ్ఛందంగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు నెలకు రెండు కేసులు అప్పగించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు భోగట్టా. గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసేందుకు కూటమి నాయకులే మద్యం దుకాణాల నుంచి రాత్రి సమయాల్లో వాహనాల ద్వారా బెల్టులకు తరలిస్తున్నారు. ఇచ్ఛాపురం, ఈదుపురం, కవిటి, బెజ్జిపుట్టుగ, బొరివంక, బల్లిపుట్టుగ, మాణిక్యపురం మీదుగా సోంపేట, కంచిలి మండలం బైరిపురం, డీజీ పురం, ఎంఎస్‌పల్లి మీదుగా బైరిపురం జంక్షన్ వరకు, సోంపేట మండలం పాలవలస, పాలేం, పాత్రఖండ, పొత్తంగి, బేసి రామచంద్రాపురం, ముండలా, కుమ్మరి నోగాం, జలంత్రకోట, శిలగాం, కొత్తపుట్టుగ, యర్రగోవిందపుట్టుగ, బూర్జపాడు, నెలవంక, కొళిగాం, బిర్లంగి, ముచ్చింద్ర గ్రామాల్లో ఇళ్లల్లో, పాన్ షాపుల్లో మద్యం సీసాలు అమ్ముతూ, ప్రతీ బాటిల్‌పై 50 రూపాయల వరకూ మద్యం ప్రియల నుంచి వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తున్న వారిని స్థానిక రాజకీయ నాయకులకు, పోలీసులకు సిండికేట్ వ్యాపారులు ప్రతినెల మామూళ్లు ఇస్తున్నట్టు నమ్మబలుకున్నారు. బాటిల్‌పై వారు రూ. 20 అదనంగా వసూలు చేస్తుంటే, తాము మరో రూ.30 అదనంగా వేసి మొత్తం 50 రూపాయలకు అమ్మితేనే గిట్టుబాటు అవుతుందని బెల్టు నిర్వాహకులు చెబుతుండడంతో మందు బాబులు అవక్కవతున్నారు. ప్రస్తుతం దసరా సీజన్ కావడంతో సిండికేట్ వ్యాపారులు ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో ప్రత్యేక వాహనాల్లో బెల్టు షాపులకు మద్యం తరలిస్తున్నప్పటికీ ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ప్రత్యేక బృందాలతో సోదాలు



గ్రామాల్లో గొలుసు దుకాణాలు నిర్వహించడంతో పాటు బాటిల్‌పై అదనంగా రూ.50 చొప్పున వేసి అమ్ముతున్నట్లు మాకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే ప్రత్యేక బృందాలు గ్రామాల్లో పర్యటించనున్నాయి. బెల్టు షాపుల్లో మద్యం అమ్మితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం. అధికంగా మద్యం అమ్మినా, బెల్టు షాపులు నిర్వహించినా వారి వివరాలను 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– పీడీ ప్రసాద్, ఎక్సైజ్ సీఐ, ఇచ్ఛాపురం

కళాకారుడుకి సత్కారం..



ప్రముఖ జానపద కళాకారుడు, మహతీ సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయరెడ్డిని విజయవాడలో ఆల్ ఇండియా కళారంగం సంస్థ గురువారం ఘనంగా సత్కరించింది. బాల గంధర్వ బాల సుబ్రహ్మణ్యం ఐదో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సకల వృత్తి కళారంగం–సకల కళల సమాహారం కార్యక్రమంలో ఎస్పీ పాడిన మధుర గీతాలను వయోలిన్‌పై వాయించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దుశ్శాలువ, మెమెంటోతో సత్కరించి అభినందించారు. – ఇచ్ఛాపురం రూరల్

కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు



వజ్రపుకొత్తూరు మండలం అమలపాడులో విజయదశమి సందర్భంగా అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నియోజకవర్గస్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే కోర్టులను ఏర్పాటు చేశామని, మూడో తేదీ వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొనదలచిన జట్లు సెప్టెంబర్ 30వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, షీల్డు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.7 వేలు, షీల్డు, 3, 4వ స్థానాల్లో నిలిచిన వారికి కూడా బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు 76079 41766, 99597 57834 నంబర్లను సంప్రదించాలని కోరారు. – వజ్రపుకొత్తూరు

ఏఐపై అవగాహన



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని హైదరాబాద్‌కు చెందిన అవ్యాన్ అల్ సంస్థ సీఈవో గంటా సుధాకర్, సహ వ్యవస్థాపకుడు బొమ్మెన శ్రీనివాస్ తెలిపారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఏఐపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐపై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ జి.ప్రసన్నలక్ష్మి, హెచ్‌ఓడీలు వై.రమేష్, బి.రమేష్‌నాయుడు, చంద్రశేఖర్, టి.చలపతిరావు పాల్గొన్నారు. – టెక్కలి

మాజీ మంత్రి పరామర్శ



కామేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పలువురు కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యానికి గురై ప్రస్తుతం కోలుకున్న కాశీబుగ్గకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మెట్ట కామేశ్వరరావును పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే లొద్దబద్ర గ్రామానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు చిన్నారి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను, మహాదేవిపురం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు బి.మాధవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను, చినంచల గ్రామానికి చెందిన పాట్నూరు కాంతమ్మ చనిపోవడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీమంత్రి వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి, నాయకులు శర్వాణ గీత, దుర్గాశంకరపండా, బత్తిన హేమేశ్వరరావు, అంబటి ఆనందరావు, బమ్మిడి దుర్యోధనరావు, చింతాడ మాధవరావు, నెయ్యిల భగీరథ, కోట ప్రసన్న, లండ జోగారావు ఉన్నారు.

దుర్గమ్మా.. శరణు శరణు...



కంచిలి: కంచమ్మతల్లి నిజరూప దర్శనం



వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక కుంకమార్చలు వైభవంగా జరిగాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



కవిటి: గొండ్యాలపుట్టుగలో సామూహిక కుంకుమార్చనలు



కవిటి: మాణిక్యపురంలో మాణిక్యేశ్వరి అమ్మవారి ఊరేగింపు



సోంపేట: లక్కవరంలో కుంకుమ పూజల్లో మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: మహాలక్ష్మి అవతారంలో తులసిగాం వైదేహి అమ్మవారు

పచ్చచొక్కాల వారికే యూరియా ఇస్తారా?

- రైతు నిరసన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



నిరసన ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, కృష్ణారావు తదితరులు



తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కంచిలి: కూటమి ప్రభుత్వంలో యూరియాను పచ్చచొక్కాలు వేసుకున్నవారికి, పచ్చ జెండాలు పట్టుకున్నవారికే పంపిణీ చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ ఆరోపించారు. కంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల రైతాంగానికి యూరియా సరఫరా సక్రమంగా చేయడం లేదని శుక్రవారం చేపట్టిన రైతు నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రమంతా రైతులకు సరిపడా యూరియా అందకపోవడమే ప్రధాన చర్చనీయాంశంగా ఉందన్నారు. జిల్లాకు చెందిన కె.అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడ యూరియా కొరత తీవ్రంగా ఉండడం దురదృష్టకరమని విమర్శించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా గ్రామస్థాయిలోనే యూరియాను అందించేవారని గుర్తు చేశారు. సచివాలయాల ద్వారా ప్రతి రైతుకు అవసరమైన యూరియా ఇవ్వడంతోపాటు కేవైసీ చేసి పంటల బీమాను సైతం ప్రభుత్వమే చెల్లించేదన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన ఏడాదిన్నర కాలంగా రైతుల కోసం ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కారని మండిపడ్డారు. అన్నదాత సుఖీభవను ఏడాదిన్నర తర్వాత కూడా అరకొరగానే అమలు చేశారని, ప్రస్తుతం రైతులకు పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయలేదు సరికదా.. యూరియా వాడితే క్యాన్సర్ వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సరికాదన్నారు. అలాంటప్పుడు యూరియాకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాత ప్రోటోకాల్ పాటించకుండా కేవలం టీడీపీ వాళ్లకే సమాచారం ఇస్తున్నారని, విత్తనాలు, ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో కాకుండా వారి కార్యకర్తలు, పచ్చ చొక్కాలు వేసుకున్నవారికే కూపన్లు ఇచ్చి పంపిణీ చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతు అనేవాడు అందరికీ అన్నం పెట్టేవాడిగా భావించి, పార్టీలకతీతంగా విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మాట్లాడుతూ.. యూరియా వాడితే క్యాన్సర్ వస్తోందని ముఖ్యమంత్రి రైతులను బెదిరించడం తగదన్నారు. బ్రిటిష్ కాలం నుంచి రైతులు దీన్ని వినియోగిస్తున్నారని గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యే యూరియా కొరతపై అసెంబ్లీలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. ఎరువుల కోసం రైతులు ఎండలో, వానలో తిరుగుతున్న విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఇప్పిలి కృష్ణారావు మాట్లాడుతూ.. యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతను ప్రభుత్వం దృష్టిలో పెట్టడానికే శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో 12 వేల ఎకరాలకు అవసరమైన 23 వేల బస్తాల యూరియాను పూర్తిస్థాయిలో రైతులకు అందజేయాలని కోరారు.

అధికారులకు వినతులు..

స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి కె.సురేష్‌లకు నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 80 శాతం యూరియా సరఫరా చేశామని తహసీల్దార్ రమేష్‌కుమార్ చెప్పడంతో నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి యూరియా ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం టీడీపీ నేతలకే యూరియా సరఫరా చేశారని, వారు చెప్పిన వాళ్లకే టోకెన్లు ఇచ్చారని ఆరోపించారు. పూర్తిస్థాయిలో పారదర్శకంగా పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, వైస్ ఎంపీపీ పాలిన కామాక్షి, నేతలు దుర్గాసి ధర్మారావు, గుమ్మడి రామ్‌దాసు, కప్పల యుగంధర్, యారడి ఆనందరావు, బొండాడ వైకుంతరావు, లద్దు కేశవపాత్రో, మద్దు వెంకటరావు, తిరుపతిరావు, కొత్తకోట శేఖర్, కొణపల సురేష్, దొక్కరి బలరాం, దొక్కరి నారాయణ, అభియాదవ్, బెందాళం శోభన్‌బాబు, మెండ మురళీనాయుడు, అయిధం జయరాం, బెందాళం ప్రవీణ్, పాశాల జగదీష్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్ యాదవ్

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు కావాల్సిన యూరియాను సకాలంలో సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈదుపురం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూరియాను ఇవ్వలేని కూటమి ప్రభుత్వం రైతులకుఉరితాళ్లు అందించే దురాలోచనలో ఉందన్న సందేహం కలుగుతుందని వ్యాఖ్యానించారు. మూడోసారి ఎమ్మెల్యే అంటూ గొప్పలు చెప్పుకుంటున్న బెందాళం అశోక్ నియోజకవర్గంలో ఎరువుల కోసం రైతులు పడుతున్న అవస్థలు, ఆవేదన కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ మొదలై సుమారు మూడు నెలలు కావస్తున్నా సరిపడా ఎరువులు అందించలేని ప్రభుత్వానికి రైతులు చెక్ పెట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

ఘనంగా వెంకటరావు మాస్టార్ జన్మదిన వేడుకలు



వెంకటరావు దొర మాస్టార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నారాయణదొర విద్యాసంస్థల అధినేత హనుమంతు వెంకటరావుదొర మాస్టార్ జన్మదిన వేడుకలు కాశీబుగ్గలోని తన స్వగృహంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వెంకటరావుదొర సేవలను కొనియాడారు. పార్టీ ముఖ్యనాయకులు శిష్టు గోపి, బత్తిన హేమారావు, బమ్మిడి దుర్యోధనరావు, బోర క్రిష్టారావు, అంబటి ఆనందరావు, తమ్మినేని శాంతారావు, పి.కె.శ్రీనివాసరావు, గుజ్జు జోగారావు, ఆర్ట్ లక్ష్మణ్, సింహాచలం పాల్గొన్నారు.

రణేశుర అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం 14వ వార్డులో కొలువైన రణేశుర అమ్మవారి ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాల పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా భవానీభక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు కృష్ణయ్య, భవానీభక్తుల గురుస్వామి గిరిబాబు పాల్గొన్నారు.